క్లుప్తంగా

గౌరవ వేతనం ఇవ్వండి



ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేస్తున్న పెసా మొబిలైజర్లు

పాల్వంచరూరల్: పంచాయతీ ఎక్స్‌టెన్షన్ షెడ్యూల్డ్ ఏరియా (పెసా) మొబిలైజర్లకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను చెల్లించాలని ఆ సంఘం అధ్యక్షుడు నరేందర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ పీఓకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. జిల్లా పెసా మొబిలైజర్లుగా 2014 నుంచి విధులు నిర్వహిస్తున్న సుమారు వందమందికి రూ.2,500 చొప్పున ఇచ్చే గౌరవవేతనం పెండింగ్‌లో ఉందన్నారు. కార్యక్రమంలో రమేష్, సురేష్, మోహన్, మీనా నాగమణి, సుభద్ర తదితరులు ఉన్నారు.

పెరిగిన జీతాలు చెల్లించండి

ఇల్లెందు: మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన వేతనాలు ఇవ్వాలని, గుడ్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయం సీఏ ఆనంద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అబ్దుల్ నబీ, కుమారీ, సావిత్రి, కనకమ్మ, ఓదెమ్మ, కౌసల్య, లక్ష్మి, మమత, జయ, యశోద, స్వరూప, మాదవీ, సువర్ణ, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల ప్రదర్శన, ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): నేషనల్ హెల్త్ మిషన్‌లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న ఉద్యోగులు సోమవారం ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ ఐదు రోజులుగా సమ్మె చేసున్నా పట్టించుకోకపోవడం శోచనీయమని విమర్శించారు. వెంటనే ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.శ్రీనివాసరావు, జి.శ్రీనివాస్, కె.మాధవి, జి.పార్వతి, డి.వీరన్న, పి.పావని, పి.ప్రశాంతి, జె.సుదర్శన్, జి.పద్మ పాల్గొన్నారు.

దిమ్మెలు కట్టి అభివృద్ధి అంటే ఎలా..?

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కేంద్రం కొత్తగూడెంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేస్తున్న హడావుడిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ విమర్శించారు. సోమవారం మున్సిపాలిటీలోని ఒకటో వార్డులో ఆయన పర్యటించారు. శిలాఫలకం లేకుండా శంకుస్థాపన చేసిన దిమ్మెకు పూలమాల వేసి నిరసన వ్యక్తం చేశారు. మాట్లాడుతూ... ఇటీవల కాలంలో ఎమ్మెల్యే వనమా వ్యవహార శైలిని చూస్తుంటే ఆయనకు మతి భ్రమించినట్లు ఉందన్నారు. ఏ సమాచారం లేకుండా నాలుగు రాళ్లతో దిమ్మె కట్టి శంకుస్థాపన చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వనమా నియోజకవర్గాన్ని తన జాగీర్ అనుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గంధం మల్లికార్జున్‌రావు, సాయి, చెనిగారపు నిరంజన్‌కుమార్, వంగా రవిశంకర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, ప్రతి ఉద్యోగికి జీవిత బీమా కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 4వ తేదీ నుండి రిలే దీక్షలు చేపట్టారు. ఈనెల 11 వరకు తమ సమస్యలను పరిష్కరించకుంటే నిరవధిక సమ్మెకు వెళ్తామని సంఘం జిల్లా జేఏసీ అధ్యక్షుడు భూక్యా మోహన్, ప్రధాన కార్యదర్శి భట్టు చందర్‌లాల్, కోశాధికారి ఎస్ కిరణ్మయి స్పష్టం చేశారు.

వారం గడిచినా ఆరు బస్సులే..

- ఆగమేఘాలపై ఇల్లెందులో ఆర్టీసీ డిపో ప్రారంభం..
- సిబ్బంది లేక రాత్రివేళ సమాచారం ఇచ్చే వారు కరువు
- కొత్త రూట్లకు బస్సులు నడవడం ప్రశ్నార్థకమే..



బస్సులు, సిబ్బంది లేక వెలవెలబోతున్న డిపో

ఇల్లెందు: ఇల్లెందు ఆర్టీసీ బస్ డిపో ద్వారా ఇక్కడి ప్రజల రవాణా వ్యవస్థ బాగు పడుతుందని అంతా భావించారు. ఆఘమేఘాలపై గత నెల 28వ తేదీన ప్రారంభోత్సవం చేశారు. అయితే వారం గడిచినా ఆరోజు కేటాయించిన ఆ ఆరు బస్సులే అటు ఇటు తిరుగుతున్నాయి. ఇంకా 18 బస్సుల కేటాయింపునకు నోచుకోలేదు. సుమారు 169 మంది వరకు సిబ్బంది కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు. డిపోలో బస్సులు మైనర్ రిపేరుకు సంబంధించిన మెటీరియల్, మెకానిక్‌ల కేటాయింపు జరగనేలేదు. కేవలం ఇద్దరు ముగ్గురు సెక్యూరిటీ గార్డులు మాత్రం ఉన్నారు. వచ్చిన బస్, వెళ్లిన బస్ వివరాలు రికార్డులలో నమోదు చేసుకుంటున్నారు. ఇక బస్టాండ్‌లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బస్టాండ్ ఇన్‌చార్జ్ వేముల నాగరాజు ఉంటుండగా, రాత్రుల్లో సమాచారం ఇచ్చేందుకు ఎవరూ ఉండటం లేదు. బస్ డిపో ప్రారంభోత్సవం జరిగిన వెంటనే అధికారులు ప్రకటించిన విధంగా అంతా కేటాయింపులు సాగిపోతాయని, నూతన రూట్లకు బస్‌లు సర్వేల కోసం వస్తాయని అంతా భావించినా అలా జరగకపోవడంతో స్థానికులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లెందు శాటిలైట్ బస్ డిపో...

ఇల్లెందులో శాటిలైట్ ఆర్టీసీ బస్ డిపో కొత్తగూడెం డీఎం పర్యవేక్షణలో ఉంటుందని, ప్రత్యేకంగా డీఎం పోస్టు ఉండదని అధికారులు తెలిపారు. కేవలం మైనర్ రిపేరు మాత్రమే ఇల్లెందులో చేస్తారని, మేజర్ అయితే కొత్తగూడెం డిపోకు తరలిస్తారని చెప్పారు. ఇల్లెందు బస్టాండ్ ఆవరణలో 2.75 ఎకరాల స్థలంలో రూ.3.75 కోట్ల(డీఎంఎఫ్) నిధులతో నూతనంగా శాటిలైట్ డిపోను ఏర్పాటు చేశారు. ఇల్లెందు, గుండాల, టేకులపల్లి, ఆళ్లపల్లి, కారేపల్లి మండలాల పరిధిలో ఈ బస్ డిపో పని చేస్తుందని ప్రకటించారు. మూడు డిపోల నుంచి 24 బస్‌లు కేటాయిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. కానీ ఖమ్మం, కొత్తగూడెం డిపోల నుంచి మూడు బస్సుల చొప్పున మాత్రమే కేటాయించారు. మిగతా బస్సులు కానీ, సిబ్బందిని కానీ కేటాయించకపోగా దూర ప్రాంతాలకు బస్సులు సర్వీసులు నడవడం లేదు. దీంతో డిపో ప్రారంభించడంతో స్థానికులు సంతోషించగా.. ఇప్పటి పరిస్థితులు చూసి నిట్టూరుస్తున్నారు. ఇకనైనా ప్రకటించిన విధంగా బస్సులు కేటాయించి దూరప్రాంతాలతో పాటు కొత్త రూట్లకు బస్సులు నడిపించాలని, రాత్రివేళ కూడా సమాచారం ఇచ్చేలా సిబ్బందిని నియమించాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



బస్టాండ్‌లో కిటకిటలాడుతున్న ప్రయాణికులు

సమాచారం ఇచ్చేవారే లేరు



ఇల్లెందులో బస్‌డిపో ప్రారంభం అయినా సిబ్బంది కేటాయింపు జరగకపోవటం వల్ల రాత్రుల్లో సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు కనీస సమాచారం ఇచ్చే నాథుడే లేడు. ఏ సమయానికి ఏ బస్ వస్తుందో తెలిసే అవకాశం లేదు. స్టేషన్ మేనేజర్ ఒక్కరే ఉన్నప్పటికీ పగటి పూట మాత్రమే ఉంటున్నారు. రాత్రుల్లో సమాచారం ఇచ్చే వారు లేకపోవటం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవల్సి వస్తోంది.

– వజ్జా సురేష్, ఇల్లెందు

అన్నీ పాత బస్సులే..



ఇల్లెందు బస్ డిపోకు ఆరు బస్‌లు వచ్చినా అన్నీ పాత బస్సులే కేటాయించారు. కొత్త బస్సులు లేకపోవటం వల్ల ప్రయాణికులు నిరుత్సాహంగా ఉంటున్నారు. ఎన్నో ఏళ్ల కల తీరిందని అంతా అనుకున్నా పాత బస్సులతో ప్రయాణం సాగుతుండటం, ఆరు బస్సులే కేటాయించటంతో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని అనుమానించాల్సి వస్తుంది. డిపోను ఉపయోగంలోకి తీసుకరావాలి.

– ఏ.సాంబ, ఇల్లెందు

ఐదు గంటల వరకు ఉంటున్నా..



బస్టాండ్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్టేషన్ ఇన్‌చార్జ్ మేనేజర్‌గా నా బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తున్నాను. కానీ రాత్రులలో డ్యూటీలకు సిబ్బంది కేటాయింపు జరగలేదు. ఈ డిపోకు పూర్తిస్థాయిలో అన్ని విభాగాలకు కేటాయింపులు జరిగిన తర్వాత అన్నీ సేవలు అందుబాటులోకి వస్తాయి. అన్నీ ఒకేసారి జరగవు. ప్రయాణికులు సంయమనం పాటించాలి.

– నాగరాజు, ఇన్‌చార్జ్ స్టేషన్ మేనేజర్, ఇల్లెందు

సింగరేణి ఆస్తులను కాపాడండి



ప్రతిజ్ఞ చేయిస్తున్న జాకీర్ హుస్సేన్

సింగరేణి(కొత్తగూడెం): శిక్షణలో నేర్చుకున్న అంశాలను విధి నిర్వహణలో పాటిస్తూ సింగరేణి సంస్థ ఆస్తులను కాపాడాలని కార్పొరేట్ సీనియర్ సెక్యూరిటీ, ట్రైనింగ్ ఆఫీసర్ ఎండీ జాకీర్ హుస్సేన్ అన్నారు. సోమవారం కొత్తగూడెం కార్పొరేట్‌లోని ఎస్ అండ్‌పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో 74వ బ్యాచ్ సెక్యూరిటీ గార్డులకు శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. సెక్యూరిటీ సిబ్బందిలో దేహదారుఢ్యం, మానసిక ఉల్లాసం, వృత్తి నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందన్నారు. రెండు వారాల పాటు పీటీ విభాగంలో వీటీసీ, స్విమ్మింగ్ యోగా... డ్రిల్ విభాగంలో ఫుట్ డ్రిల్, లాఠీ డ్రిల్ సెరిమోనియల్ డ్రిల్, సెక్యూరిటీ ఆపరేషన్స్‌లో భాగంగా సెక్యూరిటీ చట్టాలు, ఫిజికల్ సెక్యూరిటీ, ఐపీసీ, సీఆర్‌పీసీ, ఐఈఏలో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం సెక్యూరిటీ సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్‌పీ రమణ, కార్పొరేట్ జూనియర్ ఇన్‌స్పెక్టర్లు, ఫ్యాకల్టీలు, వివిధ ఏరియాల నుంచి వచ్చిన సెక్యూరిటీ గార్డులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలి



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): 11వ వేజ్‌బోర్డ్ ఏరియర్స్ ఒకేసారి చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ.. కోలిండియాలో 23 నెలల ఏరియర్స్ సెప్టెంబర్ 1న చెల్లించారని, సింగరేణిలో జాప్యం ఎందుకని ప్రశ్నించారు. ధర్నాలో యూనియన్ సలహాదారులు దమ్మాలపాటి శేషయ్య, రాజ్ కుమార్, వి.మల్లికార్జునరావు, కేంద్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.వీరస్వామి, కార్పొరేట్ కార్యదర్శి ఎస్‌వీ రమణమూర్తి, జే.గట్టయ్య, కే.రాములు, ఎస్‌కే హుమాయిన్, మధుకృష్ణ, మెంగెన్ రవి, ఎస్.నాగేశ్వరరవు, గుమ్మడి వీరయ్య, దేవ్ సింగ్, ఏసుపాదం, సురెందర్, సందెబోయిన శ్రీను, రాజేంద్రమ్, జి.నర్సింహారావు, తోట రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు పాటించండి

సింగరేణి(కొత్తగూడెం): ఫ్రంట్‌లైన్ సూపర్ వైజర్లు సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ), కోడ్ ఆఫ్ ప్రాక్టీసులను (సీఓపీ)లను పాటిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు సూచించారు. సోమవారం కొత్తగూడెం ఏరియా మైన్స్ ఒకేషనల్ ట్రైనింగ్ సెంటర్ (ఎంవీటీసీ)లో ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లు (మైనింగ్, ఎలక్ట్రికల్, మెకానికల్) జరిగిన స్ట్రక్చర్ ట్రైనింగ్ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ.. ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని సూపర్‌వైజర్లు సద్వినియోగం చేసుకొని జీరో యాక్సిడెంట్‌కు కృషి చేసి ప్రమాద రహిత ఏరియాగా కొత్తగూడెంను ముందు వరుసలో నిలబెట్టాలన్నారు. అంతే కాకుండా ఏరియాకు నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలని సూచించారు. గడచిన ఆగస్టులో 121 శాతం ఉత్పత్తి సాధించినట్లు చెప్పారు. అదేవిధంగా ఈ ఏడాదికి నిర్దేశించిన 154.5 లక్షల టన్నుల లక్ష్యసాధనకు అందరూ కలిసి కట్టుగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఏరియా ఎస్‌ఓటూ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఎంవీటీసీ మేనేజర్ వీవీఎస్ శర్మ, వీటీసీ ఆఫీసర్ కలవల చంద్రశేఖర్, వీటీసీ స్టాఫ్ శిక్షణకు హాజరైన సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయండి



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: సింగరేణిలో ఏడాది కాలంగా సంస్థకు లభించిన లాభాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె.సారయ్య డిమాండ్ చేశారు. సోమవారం జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో మొదటి వేజ్‌బోర్డు నుంచి 10వ వేజ్ బోర్డు వరకు ఏరియర్స్ కార్మికులను అందజేసిన తర్వాతనే కోలిండియా కార్మికులకు ఇచ్చే వారన్నారు. రెండు, మూడు వాయిదాలలో ఇచ్చిన సందర్భాలు ఉన్నాయని తెలిపారు. 11వ వేతన బకాయిలు మొట్ట మొదటిసారి కోలిండియా కార్మికులకు సెప్టెంబర్ 1వ తేదీన చెల్లించారని, సింగరేణిలో మాత్రం చెల్లించే తేదీలను ప్రకటించటం లేదన్నారు. ఏఐటీయూసీ ఇచ్చిన ధర్నాలు, ఆందోళనలు, ర్యాలీలను చల్లార్చటానికి మేనేజ్‌మెంట్ చేస్తున్న నాటకం మాత్రమేనని కార్మికులకు ఏరియర్స్ లాభాల్లో వాటా ఒకేసారి ఇస్తే ఒక్కో కార్మికుడికి సుమారు రూ.ఐదు నుంచి ఏడు లక్షలు వస్తాయని చెప్పారు. సమావేశంలో బ్రాంచి కార్యదర్శి నజీర్ అహ్మద్, గడదాసు నాగేశ్వరరావు, సుందర్, సంజీవచారి, దాట్ల వెంకటేశ్వర్లు, పైడిరాజు, జక్కుల శ్రీనివాస్, ప్రసాద్‌రెడ్డి, ఆంజనేయులు, తిరుమలరావు, నారాయణ,లింగన్న పాల్గొన్నారు.

ఆర్థిక చేయూత

ఇల్లెందురూరల్: మర్రిగూడెం గ్రామపంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన ఏనుగు సారయ్య చేను వద్ద విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు, ఉద్యోగులు రూ.50వేలు సేకరించారు. ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావు, రూరల్ ఏఈ రవి, లైన్‌మెన్ నవీన్ తదితరులు సోమవారం ఎల్లాపురం గ్రామంకు వెళ్లి గ్రామపెద్దల సమక్షంలో సారయ్య భార్య లలితకు అందజేశారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వండి

జూలూరుపాడు: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కొత్తగూడెం లేదా ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, జూలూరుపాడుకు చెందిన చిలుకూరి రమేష్ దరఖాస్తు చేసుకున్నారు. ఆయన వెంట మాదినేని సతీష్ ఉన్నారు.

హరితహారం మొక్కలకు నీళ్లు



మొక్కలకు నీరు పోస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

టేకులపల్లి: టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో గత నెల 28న కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా హరితహారం మొక్కలు నాటారు. కానీ ఆ తరువాత నుంచి వాటికి నీరు పోసే దిక్కు లేక ఎండిపోయాయి. దీనిపై సోమవారం 'హరీ'త హారం పేరుతో సాక్షిలో ప్రత్యేక వార్తా కథనం ప్రచురితమైంది. దీనికి పంచాయతీ అధికారులు స్పందించి సిబ్బంది చేత మొక్కలకు నీరు పోయించారు.

ఆప్ ఇన్‌చార్జ్‌గా రవి రాథోడ్



టేకులపల్లి: ఆమ్ ఆద్మీ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా టేకులపల్లి మండలం కొత్తతండా(పి) గ్రామానికి చెందిన భూక్యా రవి రాథోడ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు భూక్యా శోభన్ బాబు తనకు నియామకపు పత్రం అందజేసినట్లు తెలిపారు. ఇల్లందు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు.

సమ్మె నోటీసు అందజేత



ఇల్లెందు: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు

ఇల్లెందు: అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం చెల్లించాలని, రూ.10 లక్షల గ్రాట్యూటీ, పింఛన్, ఈఎస్‌ఐ, బీమా తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఈ నెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల నేతలు ఈసం వెంకటమ్మ, మమత తెలిపారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కె.రవికుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మరియ, ఫాతిమా, నాగలక్ష్మి, పద్మ, అంజలి, మేరి, సుజాత, వెంకటమ్మ, నాగమణి, అబ్దుల్ నబీ, బంధం నాగయ్య, మోజెస్ పాల్గొన్నారు.

సుజాతనగర్: అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ శిరీషకు అంగన్‌వాడీ టీచర్లు సోమవారం సమ్మె నోటీసు అందజేశారు. మాట్లాడుతూ.. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని లేదంటే 11వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత సౌకర్యాలు కల్పించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, వి.జ్యోతి, హేమలత, కళావతి, శశికళ, నిర్మల, మాధవి పాల్గొన్నారు.

జూలూరుపాడు: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో ఈనెల 11 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నామని తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జూలూరుపాడు తహసీల్దార్ శారదకు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం అంగన్‌వాడీ టీచర్లు మాట్లాడుతూ... అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మనెంట్ చేసి, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ వయస్సు 60 సంవత్సరాలుగా నిర్ణయించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లు బి.లలిత, సీతామహాలక్ష్మి, ప్రవంతి, సావిత్రి పాల్గొన్నారు.

వైద్యశిబిరం

జూలూరుపాడు: పడమటనర్సాపురం గిరిజన బాలికల ఉన్నత పాఠశాల (ఏజీహెచ్‌ఎస్)లో సోమవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటేశ్వర్లు విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా పంపిణీ చేశారు. ఏజీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సుభద్రమ్మ, హెచ్‌వీ సుభద్ర, హెల్త్ అసిస్టెంట్ కృష్ణ, ఏఎన్‌ఎం ఆదిలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

కార్మికులను మోసం చేస్తున్న ప్రభుత్వాలు



కేటీసీలో మాట్లాడుతున్న యాకూబ్‌షావలీ

టేకులపల్లి: కాంట్రాక్టు కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకూబ్‌షావలీ అన్నారు. సోమవారం కేటీసీ, టేకులపల్లి హైటెక్ కాలనీలో జరిగిన బెల్ట్, రోడ్ క్లీనింగ్ కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 10న ఇల్లెందులో జరగనున్న కాంట్రాక్టు కార్మికుల సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, కేసీఆర్ ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం ఇస్తానని రెండుసార్లు అధికారంలోకి వచ్చినా అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం తెలంగాణలో అన్ని రకాల కాంట్రాక్టు కార్మికులకు జీతం పెంచి, సింగరేణిలో మాత్రం జీతాలు పెంచకుండా మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు పెంచే విధంగా ముఖ్యమంత్రిని ఒప్పించాలని ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, సింగరేణి రివ్యూ మీటింగ్‌లలో సీఎంఆర్ నిధుల కోసం ఆరాటమే తప్ప కార్మికుల కోసం మాట్లాడింది లేదన్నారు. సమావేశంలో ధర్మపురి వీర బ్రహ్మాచారి, జర్పుల సుందర్, పాయం వెంకన్న, షఫీ, శివ, బాబు, ప్రసాద్, కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

లారీ అసోసియేషన్‌లో ఆధిపత్య పోరు



బాధితులతో మాట్లాడుతున్న టూ టౌన్ సీఐ రమేష్

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు రవాణాకు సంబంధించిన ట్రాన్స్‌పోర్ట్‌లో పనిచేసే గుమస్తాలను తొలగించాలంటూ సోమవారం కొత్తగూడెం ఏరియా బొగ్గు లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసు ఎదుట మహిళా ఓనర్లు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆధిపత్య పోరుకోసం ఇరువర్గాల అసోసియేషన్ నాయకుల కారణంగా కొత్తగూడెం ఏరియాలో కొంతకాలంగా బొగ్గు రవాణా నిలిచిపోయిందని, సుమారు మూడు నెలలుగా లారీలు నడవకపోవడంతో పుస్తెలు అమ్మి, లారీల ఫైనాన్స్ కడుతున్నామని, మేము రోడ్డు మీద పడ్డామని, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

విషయం తెలుసుకున్న సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది అసోసియేషన్ కార్యాలయానికి తాళం వేశారు. దీంతో సమాచారం తెలిసిన టూ టౌన్ ఎస్‌హెచ్‌ఓ రమేష్ సమస్య ఉంటే కూర్చొని మాట్లాడుకోవాలి కానీ ఆందోళనలు చేయటం సరికాదని, ఈ సమస్య పరిష్కారం అయ్యే వరకు ఆఫీసును తీయరాదని ట్రాన్స్‌పోర్ట్ సిబ్బందికి సూచించారు.


సామూహిక అన్నప్రాసన, అక్షరాభ్యాసం



అన్నప్రాసన నిర్వహిస్తున్న సీడీపీఓ నిర్మలాజ్యోతి

జూలూరుపాడు: బేతాళపాడు గ్రామ పంచాయతీ చీపురుగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ వారోత్సవాల్లో భాగంగా సోమవారం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసంతోపాటు, గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఐసీడీఎస్ చండ్రుగొండ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ నిర్మలాజ్యోతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ... గర్భిణులు, బాలింతలు పోషక విలువలు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలు, పాలు, పండ్లు, చిరుధాన్యాలు తినాలన్నారు. కార్యక్రమంలో బేతాళపాడు సర్పంచ్ గుగులోత్ రాందాస్, పంచాయతీ సెక్రటరీ ఇస్మాయిల్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఎం.లక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం



ఇల్లెందు: మాట్లాడుతున్న కోరం కనకయ్య

కొత్తగూడెంరూరల్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. కొత్తగూడెం మున్సిపాలిటీలోని 18వ వార్డులో ఎడవల్లి, లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతినగర్‌లో సీతారాములు వేర్వేరుగా గడప గడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. మాట్లాడుతూ.. ప్రజా వ్యతిరేక విధానాలు పాటిస్తున్న బీఆర్‌ఎస్ పాలకులకు బుద్ధి చెప్పాలన్నారు. రాయల శాంతయ్య, బొమ్మిడి మల్లికార్జున్, అంతోటి పాల్, ఆళ్ల మురళి, తూము చౌదరి, భావ్ సింగ్, ఉప్పల హేమంత్, మల్లేష్, సీతయ్య, సుందర్‌లాల్‌కోరి, కనకరాజు ఉన్నారు.

ఇల్లెందు: ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని, దీంతో కాంగ్రెస్ పట్ల ప్రజల్లో అనూహ్యంగా స్పందన వస్తోందని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. సోమవారం ఇల్లెందు ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 12 రోజులుగా పట్టణంలోని 24 వార్డులలో గడప గడపకు కాంగ్రెస్ అనే కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ చేపట్టిన అభివృద్ధిని వివరించినట్లు చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌కు బ్రహ్మరథం పడుతున్నారని, వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం అన్నారు. దివంగత సీఎం వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు గుర్తు చేసుకుని కాంగ్రెస్ వస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందనే భరోసాలో ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో దొడ్డా డానియేల్, పులి సైదులు, మహబూబ్, శ్రీనివాస్, వెంకటనారాయణ, జాఫర్, శారద, స్వరూప, నిర్మల పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | లక్ష్మయ్య, ACO - 8074270476
కొత్తగూడెం యాకూబ్ పాషా - 80083 21148 | భద్రాచలం కె. హరేంద్ర - 99632 02011
పినపాక ఎన్. లక్ష్మయ్య - 80742 70476 | ఇల్లందు బి. కిషన్ - 63052 41411
అశ్వారావుపేట ఎన్ దుర్గారాంప్రసాద్ -79979 58226 | టోల్‌ఫ్రీ నెం.: 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

టి. రాజేష్ - 90102 23783
ఎ. నాగేశ్వరరావు - 97054 44183
ఎన్. శేషయ్య - 99121 99148